క్లుప్తంగా

సాగునీటిని అందించండి



కౌడిపల్లిలో డిప్యూటీఈఈ జగన్నాథంకు వినతిపత్రం ఇస్తున్న చండూర్ గ్రామస్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): చండూర్ ఎత్తిపోతల పథకం ద్వారా రైతులకు సాగునీటిని అందించాలని గ్రామస్తులు దశరథ్, శేషాద్రి, నర్సింలు తదితరులు సోమవారం కౌడిపల్లిలో ఐబీ డిప్యూటీఈఈ జగన్నాథంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా చండూర్ ఎత్తిపోతల పథకాన్ని నడపడం లేదన్నారు. ప్రస్తుతం యాసంగి సిజన్‌లో సాగు నీరులేక రైతులు ఇబ్బందులు పడతున్నారని చెప్పారు. అధికారులు స్పందించి సాగునీరు అందేలా చూడాలని కోరారు. జగన్నాథం మాట్లాడుతూ.. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందిస్తున్న రాజిరెడ్డి

నర్సాపూర్: మాసాయిపేట మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు తన క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అందజేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు మల్లేశ్, కర్ణాకర్‌రెడ్డి, భిక్షపతి, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ నాయకులు సోమవారం పంపిణీ చేశారు. మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను నాయకులు చింత స్వామి, దామోదర్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, పోచగౌడ్, శ్రీధర్‌గౌడ్, కిషోర్‌రెడ్డి, సుదర్శన్, నర్సింలు, తదితరులు ఉన్నారు.

పాఠశాలల తనిఖీ



అప్పాజీపల్లి పాఠశాలలో ఉపాధ్యాయుడి బోధనను పరిశీలిస్తున్న ఎంఈఓ

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని అప్పాజీపల్లి, నీలకంఠిపల్లి పాఠశాలలను మండల విద్యాధికారి ధనుంజయ్య అకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ, విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన ఉండాలన్నారు. నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుందని తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

చేగుంట(తూప్రాన్): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని దుబ్బాక నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉసామొద్దీన్ అన్నారు. మండలంలోని పెద్దశివునూర్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నవీన్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ప్రశాంత్, మండలాధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు స్నాక్స్ అందజేత

నిజాంపేట(మెదక్): మండలంలోని రాంపూర్ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులకు స్నాక్స్ కోసం దాతలు సాయం చేశారు. ఈ మేరకు సోమవారం రాంపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థుల సాయంత్రం పూట నిర్వహించే ప్రత్యేక తరగతులకు కోసం స్నాక్స్ అందించడానికి దాతలు బందారం రాజుగౌడ్, పరశురాములు దాతలను పాఠశాల హెచ్ఎంలు పద్మారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, అర్జున్, నరేశ్, చంద్రకాంత్, కుమారస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డితో మున్సిపల్ పాలకవర్గం

నర్సాపూర్: రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి కృషి చేస్తానని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మున్సిపాలిటీ పాలక మండలి పదవికాలం 26తో ముగిసింది. సోమవారం కమిషనర్ రామకృష్ణారావు అధ్యక్షతన మున్సిపల్ వీడ్కోలు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. భారత ప్రభుత్వ ప్రతినిధిగా మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు అభివృద్ధి చేసేందుకు తనకు ఎలాంటి భేషజాలు లేవని, అందరిని కలుపుకొని పని చేస్తానని చెప్పారు. హైదరాబాద్ శివారులోని ఓఆర్ఆర్ నుంచి మెదక్ వరకు ఉన్న జాతీయ రహదారిని నాలుగు లేన్ల రోడ్డుగా విస్తరించడంతో పాటు మధ్యలో డివైడర్ నిర్మించేందుకు నిధుల మంజూరుకు ప్రతిపాదనలు సంబంధిత మంత్రికి అందజేశానన్నారు. నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. నర్సాపూర్‌లో ఈఎస్ఐ డిస్పెన్సరీ నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న లక్ష్యంతో అమృత్ 2 పథకం కింద ఉమ్మడి మెదక్ జిల్లాకు రూ.250 కోట్లు మంజూరు చేసిందని, పనులు త్వరలో ప్రారంభమవుతాయని వివరించారు. నర్సాపూర్ అటవీ ప్రాంత అభివృద్ధికి, అందులో ఆయుర్వేద మొక్కలు నాటనున్నారని తెలిపారు. స్థానిక మున్సిపల్ పాలక మండలి ప్రతినిధులు సమిష్టిగా పట్టణాభివృద్ధికి పాటుపడ్డారని, ప్రజలకు సేవ చేసినప్పుడే గుర్తింపు వస్తుందని వారిని అభినందించారు. సమావేశంలో విశిష్ట అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ.. మున్సిపాలిటీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేస్తేనే, మనమంతా ఆరోగ్యంగా ఉంటామని వారి సేవలను కొనియాడారు. రాజకీయాలకు అతీతంగా పట్టణాభివృద్ధికి కృషి చేశారని పాలక మండలిని అభినందించారు. గత ప్రభుత్వం పట్టణాభివృద్ధికి రూ.40కోట్లు మంజూరు చేయగా, ప్రస్తుత ప్రభుత్వం ఆ నిధులు రద్దు చేసిందని ఆరోపించారు. ఆ నిధులు తెచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని, అందుకు ఎంపీ సహకరించాలని తెలిపారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగడంతో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని, రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయించాలని కోరారు. సమావేశంలో తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయిమోద్దీన్, తాజా మాజీ కౌన్సిలర్లు లత, ఇష్రత్ సిద్ధిఖా, యాదగిరి, సురేశ్, రుక్కమ్మ, రాంచందర్, సునీత, బుచ్చేష్ యాదవ్, రాజేందర్, లక్ష్మి, సరిత, లలితలు మాట్లాడారు. పాలక మండలి సభ్యులను, ఎంపీ, ఎమ్మెల్యేలను, సిబ్బందిని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శాలువాలు, మెమొంటోలతో సన్మానించారు.

108 సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

కొల్చారం(నర్సాపూర్): ఆపద సమయంలో 108 అంబులెన్స్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. సోమవారం కొల్చారం మండలానికి నూతనంగా మంజూరైన 108 అంబులెన్స్‌ను ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి, జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రాథమిక పీహెచ్‌సీ వైద్యాధికారి రమేశ్, డాక్టర్, ఎంపీహెచ్ఈఓ మదన్ మోహన్, పీహెచ్ఎన్ ఏసుమని సిబ్బంది మార్తా, స్టాఫ్, జోత్స్న, స్రవంతి, రజిత, ల్యాబ్ టెక్నీషియన్ శాంతికుమార్, రాజశేఖర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గౌరీ, యువత అధ్యక్షుడు సంతోష్‌రావు, నాయకులు రాజాగౌడ్, శంకర్‌గుప్తా పాల్గొన్నారు.

కిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో..

విద్యార్థులు చదువులో రాణించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండలంలోని కిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో గ్రామ మాజీ సర్పంచ్ గోదావరి సౌజన్యంతో అక్కడి విద్యార్థులకు ప్లేట్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. అంతకుముందు పాఠశాలలోని సరస్వతీ మాత విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద మంజూరైన రూ.4లక్షలతో వేయనున్న సీసీ రోడ్డు పనులకు ఆమె భూమిపూజ చేశారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్‌కు వినతిపత్రం అందిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

నర్సాపూర్: పాత పెన్షన్ విధానం అమలు చేయాలని పీఆర్‌టీయూ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్ డిమాండ్ చేశారు. సోమవారం సంఘం నాయకులతో కలిసి ఆర్డీఓ మహిపాల్‌కు, మండల తహసీల్దార్ శ్రీనివాస్‌లకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు భద్రత లేని సీపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నామని ఆయన చెప్పారు. ఆయన వెంట సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, బీమ్లా, వీరేశం, పండరి, బాలకిషన్, రాథోడ్, శ్రీకాంత్‌గౌడ్, ఇంతియాజ్, రవికుమార్ తదితరులు ఉన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): ఏప్రిల్ 1 నుంచి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్‌ను నిరసిస్తూ వెల్దుర్తి, మాసాయిపేట తహసీల్దార్ కార్యాలయంలో పీఆర్‌టీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాసాయిపేట మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్ మాట్లాడుతూ..పెన్షన్ విధానం అమలుపై కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలు అడిగే అవకాశం ఉన్నందున గతంలో జరిగిన తప్పిదాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు హరిరంజన్‌శర్మ, మండల అసోసియేట్ అధ్యక్షుడు కనకయ్య, జిల్లా కార్యదర్శులు దయాకర్, రవి, మహిళా కార్యదర్శి బాలమణి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

పాపన్నపేట(మెదక్): సీపీఎస్ రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ సోమవారం పీఆర్‌టీయూ నాయకులు పాపన్నపేట తహసీల్దార్ సతీష్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజు, సురేశ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం యూపీఎస్ విధానాన్ని ఎప్రిల్ 2025 నుంచి అమలు పర్చాలని గెజిట్ విడుదల చేసిందన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇదే విధానాన్ని అమలు చేసే అవకాశం ఉందన్నారు. కనుక రాష్ట్ర ప్రభుత్వం పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అంజనాచారి, కార్యదర్శి జనార్దన్, జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దిరాములు, మండల అసోసియేట్ అధ్యక్షుడు సంతోష్ కుమార్, మల్లేశం, నవీన్ తదితరులు ఉన్నారు.

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ



రేగోడ్(మెదక్): తపస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ పోచయ్య



హవేళీఘనపూర్: క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు, తపస్ నాయకులు

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్‌లోని పోలీస్ స్టేషన్‌లో సోమవారం తపస్ మండల శాఖ ఆధ్వర్యంలో ఎస్ఐ పోచయ్య తెలంగాణ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తపస్ మండలాధ్యక్షుడు విఠల్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్, బాధ్యులు అంబాదాస్, సంతోష్ తదితరులు ఉన్నారు.

తపస్ నూతన కమిటీ ఎన్నిక

చిలప్‌చెడ్(నర్సాపూర్): తపస్ జిల్లా అధ్యక్షుడు ఎల్లం, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ఆధ్వర్యంలో మండల నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తపస్ (తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) మండలాధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మహేశ్, కోశాధికారిగా ప్రభాకర్, కార్యదర్శులుగా మల్లేశం, శేఖర్, ఉపాధ్యక్షులుగా యాదగౌడ్, రంజిత్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

డైరీ ఆవిష్కరణ

హవేళీఘనపూర్: ఉన్నత పాఠశాలలో ఎంఈఓ మధుమోహన్ సోమవారం తపస్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఆ సంఘం మండలాధ్యక్షుడు అంజయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ కరుణాకర్, పలువురు ఉపాధ్యాయులు, తపస్ నాయకులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకోండి

కాంగ్రెస్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రామ్‌చంద్రం

చిన్నశంకరంపేట(మెదక్): ప్రజాగాయకుడు గద్దర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యాలను వెంటనే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్‌చంద్రం డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజా ఉద్యమకారుడిని కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవిస్తుంటే బీజేపీ ప్రభుత్వం అవమానించడం విడ్డూరంగా ఉందన్నారు. గద్దర్‌తో పేద బడుగు బలహీన వర్గాలకు మేలే జరిగిందన్నారు. తాను తెలంగాణ రాష్ట్రం కోసం పాటపడినప్పుడు తెలియదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లేశం, జానార్దన్, సాయిలు తదితరులు ఉన్నారు.

టై, బెల్ట్, ఐడీ కార్డుల పంపిణీ

నర్సాపూర్ రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామ కాంగ్రెస్ నాయకుడు సుధీర్‌కుమార్‌గౌడ్ సోమవారం విద్యార్థులకు టై, బెల్ట్, ఐడీ కార్డులు పంపిణీ చేశాడు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాంబాబు, శంకర్, యోగి, ఆకుల నర్సింలు, ఆంజనేయులు, మల్లేశ్, కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతికి సెలవు ప్రకటించండి



సంగారెడ్డిలో మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసిన గిరిజన నాయకులు

పాపన్నపేట(మెదక్): సేవాలాల్ జయంతి ఫిబ్రవరి 15న సెలవు దినంగా ప్రకటించాలని కోరుతూ సోమవారం సంగారెడ్డిలో బంజార నాయకులు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు రమేశ్, రాష్ట్ర నాయకులు పూల్‌సింగ్ మాట్లాడుతూ.. ధర్మ సంస్థాపన కోసం నిరంతరం కృషి చేసి, గిరిజన జాతి సక్రమ మార్గంలో నడవడానికి ప్రయత్నించిన సేవాలాల్ జయంతి రోజును అధికారికంగా సెలవు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో హీరాలాల్, సర్దార్, సక్రూ, సంతోష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠకు ఆలయం ముస్తాబు



ముస్తాబైన రేణుకా ఎల్లమ్మ ఆలయం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తిమ్మాపూర్‌లో గౌడసంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మదేవి ఆలయంలో ఈనెల 31నుంచి ఫిబ్రవరి 4 వరకు విగ్రహ ప్రతిష్ఠోత్సవాలకు ఏర్పాటు పూర్తిచేసినట్లు నిర్వాహకులు, గౌడసంఘం నాయకులు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 31న గణపతిపూజ, పుణ్యాహవచనం, అఖండ దీపస్థాపన, అగ్నిప్రతిష్ఠ తదితర పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 1న స్వస్తివాచనం, రేణుక హోమం, మూలమంత్ర హోమం, పుష్ప, ఫల, ధాన్యాధివాసం, 2న యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతిస్వామి సమక్షంలో బాపురావ్ శర్మ, మనోజ్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. 3న కాటమయ్య బోనం, గంగస్నానం, 4న ఎల్లమ్మ కల్యాణం, నాగవెల్లి ఒగ్గుపూజారి మిద్దె రాములు, గోపాల్‌యాదవ్ ఆధ్వర్యంలో జరుగుతాయని గౌడసంఘం సభ్యులు చెప్పారు.

గుడిసెలో ఉంటున్నా.. ఇల్లు మంజూరు కాలె



గుడిసెలో నివసిస్తున్న రాజు కుటుంబం

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలోని కోమటిపల్లి వడ్డెర కాలనీలో నివాసముంటున్న వల్లపు రాజు కుటుంబం చిన్నపూరి గుడిసెలో తన కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. గృహాల మంజూరు లిస్టులో తన పేరు లేకపోవడంతో ఆందోళన చెందిన రాజు అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. వడ్డెర కాలనీలో కొందరికి కొత్తగా ఇళ్లు మంజూరు కాగా తనకు మాత్రం రాలేదని ఆయన వాపోయాడు. తాను పూర్తిగా శిథిలమైన చిన్న గుడిసెలో కుటుంబంతో నివాసం ఉంటున్నానని, ఇల్లు మంజూరులో తనకు అన్యాయం జరిగిందన్నాడు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ దేవేందర్‌ను సంప్రదించగా, ఇళ్లు మంజూరు కాని వారికి రెండో విడతలో వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

క్రికెట్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని రుద్రారంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే సంగమేశ్వర ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ఆర్‌సీఎల్ సీజన్ క్రికెట్ పోటీలకు అభ్యర్థులను ఎంపిక చేశారు. సోమవారం సంగమేశ్వర ఫంక్షన్ హాల్‌లో గ్రామంలోని క్రికెట్ క్రీడాకారులతో కలిపి 12 జట్లను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు రోజాపాషా, నవీన్, ప్రవీణ్, రేహ్మాన్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ శివకుమార్ క్రీడాకారులను అభినందించారు.

ఇబ్బందుల్లో గిరిజన విద్యార్థులు

- కలెక్టర్ సాబ్.. జర దేఖో
- చర్యలు చేపట్టని అధికారులు
- ఇంకా తెరుచుకోని రంజానాయక్ తండా బడి



రేగోడ్: తెరుచుకోని రంజానాయక్ తండా పాఠశాల



ఈనెల 4న సాక్షిలో ప్రచురితమైన కథనం

రేగోడ్(మెదక్): ప్రతీ ఒక్కరూ చదువుకోవాలని పాలకులు.. అధికారులు చెప్తున్నా.. ఆచరణలో మాత్రం చూపడం లేదనే ఆరోపణలున్నాయి. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పాఠశాల నిర్మించినా పాఠశాల తెరుచుకోవడం లేదు. జిల్లాలోనే మారుమూల రేగోడ్ మండలం ఉంటుంది. అక్కడ అధికంగా ప్రజలు వ్యవసాయం చేసుకుంటూ తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చదివిస్తున్నారు. ప్రభుత్వం అందించే ఉచిత విద్యను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థానాల్లో నిలుస్తున్నారు. అంత బాగానే ఉన్నా రంజానాయక్ తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చాలా రోజుల నుంచి మూతబడింది. అక్కడ పనిచేసే పంతులమ్మకు జిల్లా విద్యాశాఖ, ప్రభుత్వ పెద్దల అండదండలు పుష్కలంగా ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఆ పాఠశాలలో చదివే విద్యార్థులందరూ పక్క తండాలోని ప్రాథమిక పాఠశాలకు వెళ్తున్నారు. తమ తండాలోనే పాఠశాల ఉన్నా.. ప్రభుత్వం బడిని తెరిపించకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్ రాహుల్‌రాజ్ రెండు మార్లు మండలంలోని మూడు పాఠశాలలను తనిఖీ చేసినా రంజానాయక్ తండాలోని తాళం పడిన పాఠశాల విషయాన్ని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లలేదా..? అనే విషయం చర్చనీయాంశంగా మారింది. బడి మూతపడి గిరిజన విద్యార్థులు నష్టపోతున్నా.. ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా ఉండటంతో అనుమానాలకు తావిస్తోంది. ఈనెల 4న సాక్షి దినపత్రికలో మూతబడింది అనే కథనం ప్రచురితమై 22 రోజులు అవుతున్నా.. అధికారులు స్పందించకపోవడం గమనార్హం. కలెక్టర్ సాబ్.. జర దేఖో అంటూ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈఓ గురునాథ్‌ను శనివారం వివరణ కోరగా, సాక్షి కథనంపై స్పందించలేదని, ఇంకా బడి తెరుచుకోలేదని తెలిపారు. రంజానాయక్ తండా పాఠశాలలో చదివే విద్యార్థులను పక్క తండాలోని బురాన్‌వాడి పాఠశాలకు పంపిస్తున్నామని చెప్పారు.



పండరీపూర్‌కు తరలిన భక్తులు

రేగోడ్(మెదక్): మండలంలోని మర్పల్లి విఠలేశ్వర ఆలయంలో సోమవారం ఉదయం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు భక్తులు పండరీపూర్‌కు పాదయాత్రగా బయలుదేరారు. 20 ఏళ్ల నుంచి పండరీపూర్‌కు వెళ్తున్నామని అంబాదాస్ మహరాజ్ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ సీసీ రోడ్డుకు నిధులు మంజూరు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని మల్లన్నగుట్ట వరకు సీసీ రోడ్డు ఏర్పాటుకు రూ.25 లక్షల నిధులు మంజూరయ్యాయని మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ నిధుల మంజూరుకు కృషి చేసిన దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు, నార్సింగి యాదవ సంఘం నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాదగిరి యాదవ్, రాజేందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, బాచి, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్, ప్రభాకర్ ఉన్నారు.

◆ స్కూటర్ చోరీ

నర్సాపూర్: ఇంటి ఎదుట పార్కు చేసిన ఆక్టివ స్కూటర్‌ను చోరీ చేశారు. పట్టణంలోని శివాలయం సమీపంలో నివాసం ఉండే ఈర్ల కుమారి ఆదివారం రాత్రి తమ ఇంటి ఎదుట తన ఆక్టివ స్కూటర్(టీఎస్ 05ఈవై 1684)ను పార్కు చేశారు. సోమవారం ఉదయం లేచి చూసే సరికి స్కూటర్ లేదని వాపోయారు. బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగం చెప్పారు.

◆ రైతులకు చెక్కుల అందజేత

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం గ్రామంలో ప్రభుత్వ భూములను అప్పగించిన రైతులకు సోమవారం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నారాయణ మాట్లాడుతూ.. టీజీఐఐసీ కోసం వడియారం శివారు 307 సర్వేనంబర్‌లో 24 మంది రైతులు 20 ఎకరాల 22 గుంటల స్థలాన్ని అప్పగించారు. సంబంధిత రైతులకు రూ.కోటి 70 లక్షల, 93 వేల748లను పరిహారం కింద చెక్కులను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ మేనేజర్ నజీబ్, తూప్రాన్ ఆర్డీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ లక్ష్మణరావు, ఆర్ఐ భరత్‌రెడ్డి, సర్వేయర్ రవీందర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

◆ ప్రజాపాలనలో 595 దరఖాస్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజాపాలన నాలుగు సంక్షేమ పథకాలకు దరఖాస్తుల వెల్లువ కొనసాగుతోంది. ప్రభుత్వం ప్రజాపాలన సందర్భంగా రైతుభరోసా, ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులకు లబ్ధిదారుల జాబితాను గ్రామసభల్లో ప్రకటించింది. కాగా పథకాలను మంజూరు కాగా అర్హులుంటే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. దీంతో వివిధ గ్రామాలకు చెందిన 595 మంది ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. గ్రామ పంచాయతీల్లో, మండల కార్యాలయంలో దరఖాస్తులు చేసుకుంటున్నారు. దీంతో ఎంపీడీఓ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.